## క్లుప్తంగా

### ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు


వెలంపల్లి


షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ పర్వదినమని పేర్కొన్నారు. అల్లా దయతో సకల మానవాళికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

**దాతృత్వానికి ప్రతీక రంజాన్..**

వన్‌టౌన్/భవానీపురం(విజయవాడపశ్చిమ): రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో భక్తికి, దాతృత్వానికి రంజాన్ ప్రతీ కగా నిలుస్తుందన్నారు. సమాజంలో శాంతి వర్ధిల్లాలని, ప్రజలందరూ సమభావంతో జీవించాలని ఇస్లాం చెబుతోందన్నారు. ప్రజలందరికీ సకల శుభాలు చేకూరాలని అల్లాను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకులు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ ఒక ప్రకటనలో రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

### దుర్గమ్మ సన్నిధిలో పంచాంగ శ్రవణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):అమ్మవారి అనుగ్రహంతో అన్ని అనుకూలంగానే ఉంటాయని, సకాలంలో వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని దుర్గగుడి ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాసశర్మ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పూజా మండపంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయగా, ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ దంపతులు, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, భక్తులు పాల్గొన్నారు. ధార్మిక కార్యకలాపాలలో విస్తృతం అవుతాయని, ప్రజల్లో భక్తిభావన పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం చల్లా శ్రీనివాస శర్మను ఆలయ ఈవో రామచంద్రమోహన్ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందించి సత్కరించారు.

### భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గొల్లపాలెంగట్టు కస్తూరిబా ఆశ్రమం వద్ద పల్లెకిల ఉషారాణి, కాశిరెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 15ఏళ్ల కిందట వివాహం కాగా ఒక బాబు ఉన్నారు. కొంత కాలంగా కాశిరెడ్డి పనికి వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేయడంతో భార్య పనికి వెళ్తోంది. ఈ క్రమంలో కాశిరెడ్డి భార్యను వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఓ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్, సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. భవానీపురం చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు ఆటో స్టాండ్ (ఏఐటీయూసీ)ను ఆదివారం పునఃప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ఆటో కార్మికులకు జరిమానాలు విధిస్తూ వేధింపులకు గురి చేస్తుండటం తగదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతం అవుతున్న కార్మికులకు పోలీసులు విధించే జరిమానాలు మరింత భారమవుతున్నాయన్నారు. ఆటో కార్మికులు కూడా ట్రాఫిక్ నిబంధనలు, డ్రెస్ కోడ్ పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నగర ఏఐటీయూసీ నాయకులు కొట్టు రమణారావు, అల్లూరి సీతారామరాజు ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షులు మాగం ఆత్మారాము, అధ్యక్షులు గాలిబ్ షహీద్, ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి, కోశాధికారి ఎం.సిద్ధయ్య, సహాయ కార్యదర్శి సందక వెంకట్రావు, కె శివ, ఎస్.తిరుమలరావు, వేల్పుల నరసింహారావు, కె.శ్రీను, గూడేల జనార్దన్, యరసాని జోసఫ్, సుబ్రహ్మణ్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఉగాది సంబరాలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ఉత్సాహంగా పంచాంగ శ్రవణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ నియోజకవర్గంలోని ఆలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి.నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లోనూ ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజామున ప్రత్యేక వైదిక కార్యక్రమాలతో ఆలయాల్లో అభిషేకాలు చేశారు. అన్ని శైవ, వైష్ణవాలయాలతోపాటు శక్తి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానం, పాండరంగస్వామి వారి దేవస్థానం, నగరేశ్వరస్వామి వారి దేవస్థానం, అలాగే శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరం తదితర ఆలయాలతోపాటు కొత్తపేట నగరాల రామాలయం తదితర ఆలయాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

**మల్లేశ్వరస్వామికి ధాన్యాభిషేకం...**

పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారిదేవస్థానం (పాతశివాలయం)లో స్వామివారికి ఉగాది పర్వదిన సందర్భంగా బియ్యం, ధాన్యాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి వేకువజామున స్నపనాభిషేకం, అనంతరం ఖడ్గమాల పూజలు చేశారు. అయ్యప్ప స్వామివారి సన్నిధిలో గణపతి హోమం నిర్వహించారు. అలాగే ఉదయం పంచాంగ శ్రవణం అనంతరం శ్రీ మల్లేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు.

**వైభవంగా శ్రీ వారి కల్యాణం..**

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా సాగింది. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు.సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారి శాంతి కల్యాణోత్సవాన్ని అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను మేళతాళాలతో వేదికపైకి తీసుకొచ్చారు. అనంతరం విశ్వక్సేన పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కల్యాణోత్సవంలోని వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.


మహాలక్ష్మి అమ్మవారికి గాజులతో విశేష అలంకరణ


కల్యాణోత్సవంలో శ్రీవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వావసు నామ సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులు ఆదివారం తమ ఇష్టదైవాలకు పూజలు చేశారు. పండుగ నేపథ్యంలో చిట్టినగర్ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామివారికి వజ్రకవచాన్ని అలంకరించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు రామరత్నాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది సందర్భంగా 108 కిలోల పులిహోరతో స్వామివారి రూపాన్ని తీర్చిదిద్దారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉగాది పచ్చడి, పులిహోర ప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆయా ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

**మహాలక్ష్మికి గాజుల అలంకరణ..**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారికి గాజులతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాతసేవ, గాజుల అలంకరణ అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అర్చకులు ప్రసాద్‌శర్మ, కాశీ విశ్వనాథశర్మ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులు, ఉభయదాతలు ఆలయానికి తరలివచ్చి తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

**పంచామృత అభిషేకాలు**

కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ వై. సీతారామయ్య ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**హనుమత్ దీక్షా పీఠంలో...**

పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామిజీ వీరాంజనేయస్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం హోమాలను జరిపించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉగాది పచ్చడిని అందించారు.


వజ్రకవచంతో శ్రీశ్రీనివాసుడు


108 కిలోల పులిహోరతో తీర్చిదిద్దిన స్వామివారి రూపం


సుబ్రహ్మణ్య స్వామికి పంచామృత అభిషేకాలు


పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితుడు

### దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి: ఉగాది పండుగ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అధికారులు క్యూలైన్‌లో మంచినీటిని అందించడంతో పాటు భక్తులు వేచి ఉండే ప్రాంతాల్లో కూలర్లు ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



# ఉగాది పురస్కారాలు అందజేత


సభలో ప్రసంగిస్తున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి


మేయర్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న శ్రీనగరాలు సంఘ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీవిశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని ఏపీ శ్రీనగరాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రంగాలకు చెందిన పలువురికి ఉగాది పురస్కారాలను అందజేశారు. చిట్టినగర్‌లోని శ్రీనగరాల మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగాది పురస్కారాలను అందజేసి సత్కరించారు. సభకు సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎన్వీ రావు సభాధ్యక్షులుగా వ్యవహరించగా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని సూర్యారావు సభను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, విశిష్ట అతిథులుగా బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, సీపీఐ నాయకురాలు కొరగంజి దుర్గాంబ, మరుపిళ్ళ తిరుమలేష్ పాల్గొని ప్రసంగించారు. సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉగాది పంచాంగ శ్రవణం, వివిధ రంగాలకు చెందిన 55 మందికి ఉగాది పురస్కారాలను అందజేసి సత్కరించారు.

**ప్రకృతి ధర్మాన్ని తెలిపే పండుగే ఉగాది..**

వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రకృతి ధర్మాన్ని తెలిపే నిజమైన పండుగే ఉగాది అని, ప్రతి ఒక్కరూ ప్రకృతి ధర్మాన్ని కాపాడుతూ మానవ ధర్మాన్ని పాటించాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు సూచించారు. ఉగాది పండుగను పురష్కరించుకుని ఆదివారం 50వ డివిజన్‌లోని మహంతిపురంలో భగత్ సింగ్ ఆటో వర్కుర్స్ యూనియర్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.ఈసందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి సాయపడే మానవ ధర్మాన్ని పాటించాలని కోరారు. అనంతరం బాటసారులు, స్థానికులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు ఏ.రమేష్, వి.రాంబాబు, ఆవాజ్ నాయకులూ ఎస్‌డి బాషా, సిహెచ్ దుర్గారావు, వి.భారతి తదితరులు పాల్గొన్నారు.


ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

# పురాతన మసీదులకు కేరాఫ్ వన్‌టౌన్

- సరాయి మసీదుకు మూడు శతాబ్దాల చరిత్ర
- అదే కోవలో జామియా మసీదు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ సర్వమతాలను ఆదరించింది. అన్ని మతాలకు చెందిన ప్రజలు విజయవాడలో శతాబ్దాలుగా ఇక్కడ చక్కని జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజల మధ్య ఏర్పడిన బంధాలు ఇక్కడ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఇస్లాం మతానికి చెందిన అనేక పురాతన ప్రార్థనా మందిరాల (మసీదులు)కు వన్‌టౌన్ కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. ఇక్కడ మూడు శతాబ్దాల క్రితమే మసీదుల నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. అంతేకాకుండా నగరంలోని పలు మసీదులకు ఘనమైన చరిత్రతోపాటు కోట్లాది రూపాయాల విలువైన ఆస్తులను కూడా నాటి పెద్దలు సమకూర్చడం విశేషం.

**మూడు శతాబ్దాల కిందట నిర్మాణం..**

నగరంలో ఎత్తయిన భవనాల్లో ఒకటిగా మనందరికీ కనిపించే ఇందాద్‌ఘర్‌ను అనుకొని సరాయి మసీదు దర్శనమిస్తుంది. నగరంలో అత్యంత పురాతన మసీదుగా దీనిని పేర్కొంటారు. 1727లో ఈ మసీదు నిర్మాణం పూర్తయినట్లు ఇక్కడి చారిత్రిక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. పూర్తి స్థాయి నిర్మాణం జరగకుండానే ఇక్కడ ముస్లిం ప్రముఖులు ప్రార్థనలను నిర్వహించేవారని నగరంలోని ముస్లింపెద్దలు చెబుతున్నారు. సరాయి మసీదు అభివృద్ధికి పలువురు ముస్లిం ప్రముఖులు అండగా నిలిచారు. ఇందాద్‌ఘర్ నిర్మాణం తరువాత ఏటా లక్షలాది రూపాయాల పేదల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారు.

**అత్యంత ప్రాధాన్యమైన మసీదు..**

అలాగే సరాయి మసీదును ఆనుకొని మనకు కనిపించే విశాలమైన మరో ఇస్లాం ప్రార్థనా మందిరం 'జామియా మసీదు'. ఈ మసీదు కూడా 1730లో నిర్మాణం చేసినట్లు చరిత్ర చెబుతుంది. ఇస్లాం ప్రముఖులు, మత బోధకులు బాబాషా ముసాఫిర్ ఆధ్వర్యంలో ఈ మసీదు చాలా కాలం నడిచిందని, ఆ తరువాత వచ్చిన వారసులు దీనిని అభివృద్ధి చేస్తూ వచ్చారని ముస్లిం ప్రముఖులు చెబుతున్నారు. ఈ మసీదుకు నగరంలోని ముస్లిం సోదరులు చాలా ప్రాధాన్యతనిస్తారు. అత్యంత రద్దీగా ఉండే కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఈ మసీదుకు భారీ ఆస్తులు కూడా ఉన్నాయి. అంతే కాదు మహ్మద్ ప్రవక్త కేశం కూడా ఈ మసీదులో భద్రపరచబడింది. వించిపేటలో పెద్దమసీదుగా పేర్కొనే షాహీ మసీదు కూడా శతాబ్ద కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ మసీదును 1912లో నిర్మాణం చేశారు. తొలుత చిన్నపాటి ప్రాంగణంలో ప్రారంభమైన ఈ మసీదు దాతల సహకారంతో నేడు చక్కగా విస్తరించింది. పలువురు సహకారంతో అందమైన భవన సముదాయం సమకూరింది. ఈ మసీదు ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో గంజి పంపిణీ జరుగుతోంది.


చిట్టినగర్‌లోని మోతి మసీదు

**చారిత్రక మసీదు..**

వన్‌టౌన్ మొయిన్‌బజార్‌లో మనకు కనిపించే మరో చారిత్రిక మసీదు 'సిద్దిక్‌అలీ మసీదు' దీనిని నిర్మాణం చేసి రెండు శతాబ్దాలు దాటిందని స్థానికులు చెబుతున్నారు. ముస్లిం ప్రముఖులు అబ్దుల్ హకింబేగ్ వారసులు దీని నిర్వాహణను నాటినుంచి పర్యవేక్షిస్తున్నారు. మొయిన్‌బజార్‌లో ఉండే పూలకోట్ల మసీదు నిర్మాణం జరిగి కూడా 150ఏళ్లు దాటిందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. ఇస్లాంపేట బాబురాజేంద్రప్రసాద్‌రోడ్డులో ఉన్న మినార్ మసీదు, చిట్టినగర్‌లోని మోతీ మసీదు నిర్మాణాలు కూడా శతాబ్ద కాలాన్ని పూర్తిచేసుకున్నాయి.

### నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం రద్దు

పటమట(విజయవాడతూర్పు): రంజాన్ పండుగ సందర్భంగా సెలవు దినం కావడంతో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు – పరిష్కార కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న సర్కిల్ కార్యాలయాల్లోనూ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

### నేడే వడ్డీపై రాయితీకి చివరి అవకాశం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు సోమవారమే చివరి అవకాశమని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ సెలవు అయినా కూడా వీఎంసీ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు ఉదయం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. వీటితోపాటు నగర పరిధిలోని అన్ని సచివాలయాల్లోనూ పన్నులు చెల్లించవచ్చని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను బకాయలు చెల్లించి వడ్డీపై 50 శాతం రాయితీని పొందాలని ఆయన కోరారు.

### విజేతలకు బహుమతులు పంపిణీ


విజేతలతో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. చిట్టాల సదాశివ శర్మ పంచాంగ పఠనం చేయగా అందరూ ఆసక్తిగా ఆలకించారు. ఈసందర్భంగా సూరిశెట్టి రామయ్య–మహిలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్, చెస్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. క్యారమ్స్ పోటీలో విన్నర్‌గా పరిమి గణేష్, రన్నర్‌గా ప్రతాప శ్రీనివాసరావు నిలిచారు. తృతీయ, చతుర్ధ బహుమతులను షేక్ ఇనయతుల్లా, వెలివెల రవి గెలుచుకున్నారు. చెస్ పోటీలో విన్నర్‌గా ప్రతాప శ్రీనివాసరావు, రన్నర్‌గా మండలి రత్నాకర్, మూడు, నాలుగో బహుమతులను కారుమూరి శ్యామ్ రవికుమార్, వెలివెల రవి గెలుచుకున్నారు. అనంతరం విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావు కవితలు వినిపించారు. అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షులు ఏమినేని వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి హాజరయ్యారు. గౌరవాధ్యక్షులు దేవరకొండ శేషగిరిరావు, సెక్రటరీ సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, సభ్యులు పొట్లూరి విశ్వేశ్వరరావు, శ్రవణం కనకారావు, కె భగవంతరావు, సాలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### దక్షిణోత్తరం నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాదిని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో ఆదివారం దక్షిణోత్తరం ప్రత్యేక నృత్య ప్రదర్శన జరగనుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సాయంత్రం ఆరుగంటలకు ఈ ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించారు. గుడి సంబరాల పేరిట పరంపర ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తొలుత కళావేదికపై ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ దంపతులు, ఫౌండేషన్ బాధ్యులు శ్రీనగి, శశిరెడ్డి, ప్రమోద్ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలైన నిరుపమ, రాజేంద్ర భరతనాట్యం, కథక్ రెండు శాస్త్రీయ నృత్య ప్రక్రియల అద్భుతమైన సంగమాన్ని దక్షిణోత్తరంలో ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున సంగీతాభిమానులు, అమ్మవారి భక్తులు తరలివచ్చారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈఓ రామచంద్రమోహన్ దంపతులు


నృత్యప్రదర్శన చేస్తున్న నిరుపమ, రాజేంద్ర బృందం

### కోడి పందేలపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టేకు తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేలపై కొత్తపేట పోలీసులు ఆదివారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తూరు తాడేపల్లిలోని టేకు తోటల్లో కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆయా పరిసరాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం సాయంత్రం కొంత మంది కోడి పందేలు వేస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు తోటల్లో దాడులు చేశారు. కోడి పందేలు వేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి వద్ద నుంచి రూ.5640 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.